
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5 జనగామ
శనివారం 29 నవంబరు 2025



లక్ష్యం వైపు దూసుకెళ్లాలి
- ఏఐతో బోధనలో మార్పులు అవసరం
- మైక్రాన్ ఇండియా వైస్ చైర్మన్ రామమూర్తి
- ఘనంగా వరంగల్ నిట్ 23వ స్నాతకోత్సవం
- 1,913 మందికి పట్టాల ప్రదానం

7

ఆమే.. కీలకం

జిల్లాలో 50 శాతానికి పైగా వారే..

2,02,963 మంది ఓటర్లు

గెలుపోటములను ప్రభావితం చేయనున్న మహిళా ఓటర్లు



'పంచాయతీ'లో మహిళా ఓటర్లదే హవా

జనగామ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మహిళలే కీలకం కానున్నారు. ఎన్నికల్లో భాగంగా అభ్యర్థుల గెలుపోటములను మహిళలు ప్రభావితం చేయనున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఓటర్లలో మహిళల ఓట్లే 50శాతానికి మించి ఉన్నాయి. మహిళలు ఏ పార్టీకి అనుకూలంగా ఉంటే ఆ పార్టీ అభ్యర్థుల గెలుపునకు అవకాశాలు ఉండనున్నాయి. దీంతో మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకునేలా ఆయా పార్టీలు ప్రయత్నాలు సాగిస్తున్నాయి. మొదటి విడతలో ఎన్నికలు జరిగే మండలాల్లో ఇప్పటికే మహిళల ఓట్లపై ఆయా పార్టీలు దృష్టి పెట్టగా రెండు, మూడు విడతల్లో ఎన్నికలు జరిగే మండలాల్లో ఆయా పార్టీల నాయకులు మహిళల ఓట్లను ఏ విధంగా రాబట్టుకోవాలన్న దానిపై తర్జనభర్జనలు పడుతున్నాయి.

ఐదు మండలాల్లో వారే ఎక్కువ..

జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో మహిళల ఓట్లే అధికంగా ఉన్నాయి. మొదటి విడతలో ఎన్నికలు జరిగే ఐదు మండలాల్లోనూ మహిళల ఓట్లే ఎక్కువగా ఉన్నాయి. దీంతో గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్‌లో వారే ప్రధానం కానున్నారు. ఈ క్రమంలో ఆయా పార్టీల నేతలు, అభ్యర్థులు ఈపాటికే మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలోపడ్డారు. ఆశావహులు, పార్టీల నాయకులు మహిళా ఓటర్లను కలుస్తూ 'అమ్మా మీరే దిక్కు, ఈ తమ్ముడిని దీవించాలి, ఈ అన్నను గెలిపించుకోవాలి' అంటూ మహిళా ఓటర్లను ఇప్పటి నుంచే ఓట్లు అభ్యర్థించే పనిలో పడిపోయారు. పురుషులతో పోలిస్తే ఓటింగ్ విషయంలో మహిళలు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారనే అభిప్రాయం పార్టీల్లో బలంగా ఉంది. మహిళలు తమకు మాట ఇస్తే కచ్చితంగా ఓటే వేస్తారనే నమ్మకం ఏళ్లుగా కొనసాగుతోంది. దీంతో వారిని ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు పార్టీలు ప్రారంభించాయి. ఇందిరమ్మ చీరల పంపిణీలు, వడ్డీలేని రుణాల పంపిణీ, ఉచిత బస్సు ప్రయాణం వంటి అంశాలను కాంగ్రెస్ ప్రస్తావిస్తుండగా, గతంలో తాము ఇచ్చిన బతుకమ్మ చీరలు, ఒంటరి మహిళకు పింఛన్లు, బీడీ కార్మికుల పింఛన్లు, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ వంటి వాటిని బీఆర్‌ఎస్ పార్టీ మహిళా ఓటర్ల వద్ద ప్రస్తావిస్తోంది. కాగా.. ఆయా పార్టీలు తమ అనుకూలతను చెప్పుకోవడంతో పాటు ప్రత్యర్థుల తప్పిదాలను ఎత్తిచూపుతున్నాయి. ఇదే క్రమంలో బీజేపీ, సీపీఎం, సీపీఐ పార్టీలు సైతం తమ అనుకూలతలను, ప్రత్యర్థుల తప్పిదాలను » మిగతా 8వ పేజీలో...

మొదటి విడత ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	మొత్తం
చిల్పూర	16,473	16,853	33,327
స్టేషన్‌ఘన్‌పూర్	13,177	13,387	26,564
రఘునాథపల్లి	22,279	22,729	45,010
జఫర్‌ఘడ్	16,928	17,320	34,249
లింగాలఘనపురం	16,323	17,033	33,356
మొత్తం	85,180	87,322	1,72,506

రెండో రోజు పెరిగిన నామినేషన్లు

నేటితో ముగియనున్న నామినేషన్ల ప్రక్రియ


జనగామ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నిక ల్లో భాగంగా నామినేషన్ల స్వీకరణ రెండో రోజు ప్రశాంతంగా ముగిసింది. మొదటి రోజుతో పోలిస్తే రెండో రోజు నామినే షన్లు పెరిగాయి. మొదటి విడత ఎన్నికలు జరిగి మండలాల్లో రెండో రోజు సర్పంచులకు 153, వార్డు సభ్యుల స్థానాలకు 190 నామి నేషన్లు దాఖలయ్యాయి. లింగాలఘనపురం మండలంలోని సర్పంచులకు 36, వార్డు సభ్యులకు 55 నామినేషన్లు, » మిగతా 8వ పేజీలో...

పంచాయతీ ఎన్నికల నామినేషన్ కౌంటర్ — రెండో రోజు 28-11-25

మండలం పేరు	సర్పంచ్ స్థానాలు	దాఖలైన నామినేషన్లు	వార్డు సభ్యులు	దాఖలైన నామినేషన్లు
లింగాఘనపురం	21	36 (51)	196	55(66)
జఫర్‌గడ్	21	27 (51)	194	23 (31)
చిలుపూర్	17	22 (39)	168	34 (44)
స్టేషన్‌ఘన్‌పూర్	15	24 (41)	146	31 (38)
రఘునాథపల్లి	36	44 (79)	320	47 (55)
మండలం	110	153 (261)	1024	190 (234)

నోట్: (బ్రాకెట్)లో ఇప్పటి వరకు దాఖలైన మొత్తం నామినేషన్ల సంఖ్య

ఫండ్ గండం



అటు ఇష్టం.. ఇటు కష్టం..

పదవిపైన మోజుతో బరిలోకి పలువురు

అవకాశం కలిసి వచ్చినా..

ఊరికి ఒక్కసారైనా సర్పంచ్ కావాలనే కల చాలామందికి ఉంటుంది. ప్రథమ పౌరుడిగా తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలనే ఆశతో ఎన్నికల్లో పోటీకి ఏళ్లతరబడి అవకాశం ఎదురుచూస్తున్న వాళ్లు ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,708 గ్రామపంచాయతీలు ఉండగా, 15,006 వార్డు స్థానాలు ఉన్నాయి. వీటిలో 50శాతం వివిధ వర్గాలకు రిజర్వేషన్లు చేశారు. అయితే వీటిలో 803 సర్పంచ్ స్థానాలు, 6,645వార్డుస్థానాలు మహిళలకు రిజర్వుడు చేశారు. పాత రిజర్వేషన్లను రోటేషన్ పద్ధతిలో మారుస్తూ రిజర్వేషన్లను ఖరారు చేశారు. చాలామందికి రిజర్వేషన్లు కలిసి వచ్చాయి. రిజర్వేషన్లు అనుకూలించని వారు తమ భార్య, తల్లీ, కూతరును బరిలో దించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే మొదటి విడతల ఎన్నికల నామినేషన్ల ఘట్టం మొదలైంది. సర్పంచ్ కావాలనే కల కళ్ల ముందు ఉన్నా.. ఖర్చులను చూస్తే అభ్యర్థులకు దడ మొదలవుతుంది.

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

సర్పంచ్‌గా పోటీ చేయాలని ఆశ.. కానీ, ఖర్చులను భరించేందుకు పైసలు ఎట్లా అనే మీమాంస.. పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు కలిసి వచ్చి పోటీకి ఉత్సాహం ఉన్నా.. చేతిలో చిల్లిగవ్వలేక ఆశావహుల్లో నిరాశ. తాజా మాజీ సర్పంచ్‌లకు చేసిన పనులకు బిల్లులే రాక ఇంకా అవస్థలు పడుతున్న తీరు.. పోటీదారులకు అప్పు పుట్టకుండా చేస్తోంది. ప్రధాన పార్టీల మద్దతు కావాలన్నా.. నీ చేతిలో ఎంత ఉందో ముందు చెప్పు.. అంటూ ఎదురు ప్రశ్నలు. దీనికి తోడు రియల్ బూమ్ లేకపోవటం.. పంటల ఆదాయం అంతంతే ఉండటంతో అభ్యర్థులను కాసుల కష్టాలు వెంటాడుతున్నాయి. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావటంతో తెలిసినోళ్లందరినీ కలిసి నీ దగ్గర ఏమైనా ఉంటే సర్దుబాటు చేయమంటూ పడరాని పాట్లు పడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏ గ్రామానికి వెళ్లిన పోటీదారులు పైసల వెతలు ఇవి.

పోటీ సరే.. కాసులెట్లా..?

అసెంబ్లీ, పార్లమెంట్, సర్పంచ్.. ఏ ఎన్నికైన కాసులతో ముడిపడి పోయింది. ప్రచారంలో ప్రత్యర్థులకు దీటుగా రంగంలో ఉండాల్సిందే. ఖర్చులో తగ్గేదేలే అంటేనే క్యాడర్ అభ్యర్థి వెనుక నిలబడుతుంది. లేదంటే వారి దారి వారిదే అనే భయం. దీంతో పోటీకి సిద్ధమైన అభ్యర్థులకు ఖర్చుల టెన్షన్ పట్టుకుంది. ఎన్నికల్లో బ్యానర్లు, వాల్ పోస్టర్లు, ప్రచార వాహనాలు, రోజువారి క్యాడర్ ఖర్చు, పోల్‌మేనేజ్‌మెంట్. వీటన్నింటికి తోడు మందు, మాంసం లెక్కలు వేరే అనే టాక్ ఉంది. ఇలా ఎన్నికల వ్యయం తడిసిమోపెడు అవుతుందనే టెన్షన్‌లో అభ్యర్థులు ఉన్నారు. వెయ్యి ఓట్ల లోపు గ్రామమైతే తక్కువలో తక్కువగా రూ.8లక్షల నుంచి రూ.10లక్షల వరకు ఖర్చు అవుతుందనే అంచనాల్లో ఉన్నారు. రెండువేల లోపు జీపీల్లో

(మిగతా 7లో..)

- ఎన్నికల ఖర్చుకు సరిపడ డబ్బుల్లేక వెతలు
- పోటీదారులకు అప్పు ఇచ్చేందుకు ఆసక్తిచూపని వడ్డీవ్యాపారులు
- మాజీ సర్పంచ్‌లకే చేసిన పనులకు బిల్లుల పెండింగ్
- గెలిచినా.. ఖర్చు పెట్టింది సంపాదించేదెప్పుడో అనే అనుమానం
- డబ్బుల సర్దుబాటుకు అభ్యర్థుల పాట్లు
- చేతిలో చిల్లిగవ్వ లేకున్నా.. పోటీకి సై



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సృజనాత్మకత పెంపునకే వైజ్ఞానిక ప్రదర్శనలు

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలి

సైన్స్ ఫెయిర్ ప్రారంభోత్సవంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా

410 ఎగ్జిబిట్లు.. ఆసక్తిగా తిలకించిన విద్యార్థులు

జనగామ కల్చరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకే వైజ్ఞానిక ప్రదర్శనల నిర్వహణ అని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జనగామ జిల్లా కేంద్రంలోని సాన్‌మారియా హైస్కూల్‌లో శుక్రవారం స్టెమ్ ఫర్ వికసిత్ అండ్ ఆత్మనిర్భర్ భారత్ నినాదంతో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్, విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన-25 కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. సైన్స్ ఫెయిర్ కన్వీనర్, డీఈవో, జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అధ్యక్షత వహించగా కలెక్టర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సాన్‌మారియా విద్యార్థులు మార్చ్ ఫాస్ట్‌తో కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు ఘన స్వాగతం పలికారు.

కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవరచుకోవాలన్నారు. ఎంచుకున్న థీమ్స్, సబ్ థీమ్స్ అభిరుచులకు తగ్గట్టుగా దేశానికి » మిగతా 8వ పేజీలో...



శాస్త్రీయ నృత్యాన్ని ప్రదర్శిస్తున్న సాన్‌మారియా విద్యార్థులు



మేడారంలో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న మంత్రులు

విస్తరణ పనుల్లో వేగం పెంచాలి

డిసెంబరు 4లోగా పూర్తి చేయాలి

రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాసరెడ్డి

మంత్రులు సీతక్క, సురేఖతో కలిసి మేడారం పర్యటన

ములుగు/తాడ్వాయి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా మేడారంలో చేపడుతున్న వనదేవతల గద్దెల విస్తరణ పనులను డిసెంబరు 4లోగా పూర్తిచేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. పంచాయతీరాజ్, దేవాదాయ శాఖ మంత్రులు ధనసరి సీతక్క, కొండా సురేఖ, ఎంపీ బలరాం నాయక్‌తో కలిసి ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు, కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. దేవస్థానంలో శాశ్వత ప్రాతిపదికన చేపట్టిన నిర్మాణాల బేస్‌మెంట్, రాతి కట్టడాలను పరిశీలించారు. వందలాది ఏళ్లు చెక్కు చెదరకుండా నిర్మాణాలను చేపడుతున్న దృష్ట్యా నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. గద్దెల పనులను పరిశీలించి, ఉపమండపం నిర్మాణాలను వెంట వెంటనే చేపట్టాలని ఆదేశించారు.

వనదేవతల దర్శనం

అభివృద్ధి పనులను పరిశీలించేందుకు హెలీకాప్టర్ ద్వారా మేడారం చేరుకున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి సీతక్క, కొండా సురేఖ ముందుగా వనదేవతలను దర్శించుకున్నారు. అనంతరం రహదారుల విస్తరణ, జంపన్నవాగు స్నానఘట్టాలు, ఆర్టీసీ బస్టాండ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ డిసెంబరు 4న గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెల పునః ప్రతి ష్ఠాపన ఉంటుందని, ఈలోపే పనుల్లో వేగం పెంచి సకాలంలో పూర్తి చేస్తామన్నారు. డిసెంబరు చివరి నాటికి రోడ్ల విస్తరణ, దేవస్థానం అభివృద్ధి పనులు తుది దశకు చేరుకుంటాయన్నారు.

ముడుపులివ్వనిదే మ్యుటేషన్ చేయనన్నాడు..

గిరిజన రైతుకు పెద్దవంగర తహసీల్దార్ వేధింపులు

తన డ్రైవర్‌కు డబ్బులివ్వాలని హుకుం

రూ.15వేలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ



పట్టుబడిన తహసీల్దార్ మహేందర్, డ్రైవర్ గౌతమ్

పెద్దవంగర, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మరణించిన తన తండ్రి పేరు మీద ఉన్న ఆస్తిని తన పేరున రిజిస్ట్రేషన్ చేయాలని కోరిన గిరిజన రైతును తహసీల్దార్ వేధించాడు. డబ్బులు ఇస్తేనే భూమి మారుస్తానని చెప్పాడు. ఇందుకోసం ఫైల్‌ను చాలా రోజులుగా ఆపాడు. దీంతో చేసేదేమీలేక డబ్బులు ఇస్తామని ఒప్పుకున్న బాధిత కుటుంబం.. అవినీతి నిరోధక శాఖ అధికారులను » మిగతా 8వ పేజీలో...

● లాలిజో.. లాలీజో..



సహజంగా ఖాకీల్లో ఎక్కువశాతం కరుకుదనమే కనబడుతుంది.. కానీ అదే ఖాకీల్లో కనికరం కూడా ఉంటుందని నిరూపించాడు జనగామ వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్.. మొదటి విడత పంచాయతీ ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో నామినేషన్ కేంద్రాలను పరిశీలించేందుకు శుక్రవారం లింగాలఘణపురం మండల కేంద్రానికి చేరుకున్న డీసీపీ రాజమహేంద్ర చంకన చంటిబిడ్డనెత్తుకుని నామినేషన్ వేయడానికి వచ్చిన ఓ తల్లిని గమనించారు. వెంటనే ఆ తల్లి దగ్గర నుంచి చంటిబిడ్డను తన చేతుల్లోకి తీసుకుని కాసేపు ఎత్తుకుని లాలించారు. అంతే కాదు జోలాలీ.. ఆడాలి అంటూ జోల పాటపాడుతూ బుజ్జగించడం విశేషం.

లింగాలఘణపురం(ఆంధ్రజ్యోతి)

బీసీలపై బీజేపీ మొసలి కన్నీరు.!

అసెంబ్లీలో బీసీ బిల్లు పెట్టింది కాంగ్రెస్సే..

ఆ తర్వాతే తెలంగాణలో బీసీలపై చర్చ మొదలు

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం



నెల్లుట్లలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

లింగాలఘణపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీసీ రిజర్వేషన్ల బిల్లుకు బీజేపీ మోకాలడ్డుపెట్టి తెలంగాణలో కాంగ్రెస్ బీసీలను మోసం చేస్తోందని మాట్లాడుతూ బీజేపీ మొసలి కన్నీరు కారుస్తోందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆరోపించారు. శుక్రవారం నెల్లుట్లలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు.

కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం అసెం బ్లీలో ఏకగ్రీవంగా తీర్మానించి కేంద్రానికి పంపితే బీజేపీ ప్రభుత్వం దాన్ని ఆమోదించకుండా, తిరస్కరించకుండా పెండింగ్‌లో పెట్టి మోసం చేసిందన్నా రు. అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల తీర్మానంకు మద్దతు తెలిపిన బీజేపీ ఎమ్మెల్యేలు ఆ ఫైల్ ఢిల్లీకి వెళ్లిన తర్వాత చేతులెత్తేశారన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రులుగా ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో పాటుగా మిగతా బీజేపీ ఎంపీలు కేంద్రంపై, ప్రధాని నరేంద్రమోదీపై ఒత్తిడి తీసుకొచ్చి పార్లమెంట్‌లో బీసీ బిల్లును ఆమోదించి » మిగతా 8వ పేజీలో...

చట్టాన్ని అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు

దంతాలపల్లి, నవబంరు 28 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో చట్టాన్ని అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్థానిక ఎస్సై పిల్లల రాజు హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండలంలోని దాట్ల గ్రామంలో అన్ని పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల అధికారుల సలహాలు, సూచనల మేరకే పోటీలో ఉండే అభ్యర్థులు తమ తమ దరఖాస్తులను నేరుగా కేటాయించి సెంటర్లలో ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణకు ఆరు సెంటర్ల ఏర్పాట్లు

దంతాలపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 30 నుంచి డిసెంబరు 2 వరకు స్వీకరించనున్న స్థానిక ఎన్నికల సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా ఆరు సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో విజయ అన్నారు. శుక్రవారం ఆమె నేతృత్వంలోని మండలాధికారుల బృందం సభ్యులు తహసీల్దార్ సునీల్‌కుమార్, గిర్దావర్ రాజు, ఎంపీవో మహ్మద్ అప్సరపాషా, పంచాయతీ కార్యదర్శి ఏశబోయిన వెంకన్న యాదవ్ నామినేషన్ దాఖలు చేసే కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దంతాలపల్లి మండల కేంద్రంలోని జీపీ భవనంలో దంతాలపల్లి, గున్నేపల్లి, బొడ్లాడ, పెద్దముప్పారం జీపీలో పెద్దముప్పారం, కుమ్మరికుంట్ల జీపీలో కుమ్మరికుంట్ల, రేపోణి, లక్ష్మీపురం, నిదానపురం, బీరిశెట్టిగూడెం జీపీలో బీరిశెట్టిగూడెం, వాల్యతండ, దాట్ల, వేములపల్లి జీపీలో వేములపల్లి, రామానుజపురం, దొనకొండ, ఆగపేట జీపీలో ఆగపేట, తూర్పుతండా, రామవరం, దుబ్బతండ వారు నామినేషన్ల పత్రాలను సమర్పించాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన

దంతాలపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ హేమ అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని తూర్పుతండా, మేగ్యాతండా, రేక్యాతండాలో పర్యటించి నిర్మాణంలో ఉన్న గృహాలు, నాన్‌స్టార్టెడ్ హౌస్ లబ్ధిదారులతో మాట్లాడారు. నిలిచిపోయిన ఇళ్లను పునరుద్ధరించేందుకు పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

గెలిచే అభ్యర్థులకే సర్పంచ్ టికెట్ కేటాయిస్తాం

దంతాలపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సర్పంచ్ పోటీలకు తీవ్ర పోటీ ఉండడండతో గెలుపొందు అభ్యర్థులను చూసే టికెట్ ఖాయం చేసి తమ అభ్యర్థిగా ప్రకటిస్తామని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గుగులోతు భట్టునాయక్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ఇప్పుడే వచ్చి పార్టీ టికెట్ అడిగితే అట్టి వారిని టికెట్ ఇవ్వబోమన్నారు. కార్యక్రమంలో నాయకులు పొన్నోటి బాలాజీ, భద్రునాయక్, వెంకటేశ్వర్లు, కాశునాయక్, నెహ్రూనాయక్, పోట్యానాయక్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన విక్రయాలకు రశీదులు తప్పనిసరి

దంతాలపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఫర్టిలైజర్ షాపుల యాజమానులు యాసంగి పంట సాగుకు తీసుకుంటున్న విత్తనాల విక్రయాలకు సంబంధించిన రశీదులను రైతులకు తప్పక ఇవ్వాలని వ్యవసాయాధికారి వాహిని అన్నారు. శుక్రవారం ఆమె మండల కేంద్రంలోని రైతు వేదికలో మాట్లాడుతూ రైతులకు విత్తనాల విక్రయం జరిపేటప్పుడు తప్పక రశీదులు, స్టాక్ రిజిష్టర్‌తో పాటు రోజువారి విత్తనాల విక్రయం రిజిష్టర్లను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో దీక్షిత్‌కుమార్, శిరీష, ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన టీచర్‌కు సన్మానం

మరిపెడ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిల్లంచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న షేక్ మహమూద్ శుక్రవారం ఉద్యోగ విరమణ పొందగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈవో గాదె అనితాదేవి మాట్లాడారు. ఉపాధ్యాయుడు మహమూద్ అంకితభావం, నిస్వార్థ సేవలు నేటి తరానికి స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. మహమూద్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ఉపాధ్యాయురాలు వై.జయ, శ్యాంసుందర్ రెడ్డి, పీఆర్టీయూ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు గుర్రం వెంకన్న, నందిగామా జనార్ధనాచారి, డోర్నకల్ మండల అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, కాసుమారెడ్డి, జి.మంగు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, బంధుమిత్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆస్మిత బాలికల టాలెంట్ ఐడెంటిఫికేషన్


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

జనగామ కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఖేలో ఇండియా సంయుక్తంగా నిర్వహించిన ఆస్మిత బాలికల టాలెంట్ ఐడెంటిఫికేషన్ కార్యక్రమం ఉత్సాహం గా జరిగింది. శుక్రవారం జనగామలోని ధర్మకంచ మినీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో 550 మంది బాలికలు పాల్గొని ప్రతిభ ను కనబరిచారు. ఎంపికైన వారికి అసోసియేషన్ ఆధ్వర్యంలో పతకాలు, సర్టిఫికేట్లను ప్రదానం చేశారు. వారి నైపుణ్యతను బట్టి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ కోశాధికారి అశోక్, నిర్వాహక కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, క్రీడా కార్యదర్శులు కిషన్, గోర్‌సింగ్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కైరిక హనుమంతరావు, అసోసియేషన్ సభ్యులు రంజిత్, సురేష్ రాజు, మంజుల, లచ్చిరాం, సైదులు, జీవ ప్రణీత, సుధారాణి, శ్రీదేవి, నిర్మల, నీల పాల్గొన్నారు.

● లింగాలఘణపురం: అస్మిత అథ్లెటిక్స్ లీగ్‌లో వనపర్తి జడ్పీహైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభను చాటి కాంస్య పతకాన్ని అందుకున్నట్టు ఎంఈవో పడాల విష్ణుమూర్తి తెలిపారు. అండర్-16 విభాగంలో ఆసర్ల తేజశ్రీ హైజంప్‌లో కాంస్యం, 60 మీటర్ల విభాగంలో కాలి మౌనిక కాంస్యం అందుకున్నారు.

పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం


మాట్లాడుతున్న మాజీ మంత్రి డీఎస్.రెడ్యానాయక్

చిన్నగూడూరు (మరిపెడ), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకే విజయం దక్కుతుందని మాజీ మంత్రి డీఎస్.రెడ్యానాయక్ అన్నారు. శుక్రవారం చిన్నగూడూరు మండల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో పంచాయతీ ఎన్నికల సన్నాహక సమావేశం ఉగ్గంపల్లిలో నిర్వహించగా రెడ్యానాయక్ పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్‌తోనే రైతు బంధు సాధ్యమని గుర్తుచేశారు. సర్పంచ్ అభ్యర్థులు ఇంటింటికి తిరిగి ఓటర్లను అభ్యర్థించాలన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు డీఎస్.రాంసింగ్, రైతు సమితి మండల కో-ఆర్డినేటర్ మంగపతిరావు, నాయకులు బంటు ఉప్పలయ్య, వల్లూరి చెన్నారెడ్డి, భర్తపురం కొమురెల్లి, యాకీనాయక్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనం సృష్టిస్తాం


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లపు వెంకటేశ్వర్లు

దంతాలపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జరగనున్న స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందారని జిల్లా బీజేపీ పార్టీ అధ్యక్షుడు వల్లపు వెంకటేశ్వర్లు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడు తూ నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధిని ఇంటింటికి తీసుకెళ్లాలన్నారు. క్షేత్రస్థాయిలో సర్పంచ్ అభ్యర్థులను గెలిపిస్తే తప్పక మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. దంతాలపల్లి మండలంలోని 18 జీపీలో సర్పంచ్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపిస్తే నరేంద్ర మోదీ నాయకత్వంలో పల్లెల్లో మరింత సంక్షేమాన్ని చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్, గడ్డం అశోక్‌కుమార్, మండల అధ్యక్షుడు గుండగాని భరత్‌గౌడ్, నాయకులు రాణిరెడ్డి, ఉప్పలయ్య, మురళి, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

మరిపెడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉన్నత శిఖరాలను ఆధిరోహించాలని మరిపెడ వాసవీ క్లబ్ అధ్యక్షుడు తల్లాడ చంద్రమోహన్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం ఆ క్లబ్ ఆధ్వర్యాన రూ.25వేల విలువ చేసే పరీక్ష కిట్లను స్కూల్ విద్యార్థులకు అందచేసి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆ క్లబ్ ముఖ్యులు వప్పుల నాగేశ్వర్‌రావు, స్వర్ణలత, గరైపల్లి నగేశ్, వెంకన్న, బోనగిరి సురేశ్, వంగపల్లి భరత్, భద్రయ్య, నాగేశ్వర్‌రావు, జానకీరాములు, నాగరాజు, రాజు, సంతోశ్, కిరణ్, సంకనాగయ్య తదితరులు పాల్గొన్నారు. ఆ స్కూల్ నిర్వాహకులు వాసవీ క్లబ్ బాధ్యులను అభినందించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

తొర్రూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తొర్రూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రాం నర్సయ్య, సేవా తరుణి అధ్యక్షురాలు శ్రీదేవి రెడ్డి తెలి పారు. క్లబ్ సభ్యుల సాకారంతో పట్టణంలో ప్రసాద వితరణ, వైద్య పరీక్షలు, ఇతర సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. క్లబ్ సభ్యుల జన్మదినాలను పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు చేస్తూ, పేద ప్రజలను అన్ని విధాల ఆదుకుం టున్నామని తెలిపారు. క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత దంతవైద్య శిబిరాన్ని నిర్వహించి 50మందికి దంత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కె.రాజేందర్ రెడ్డి, లక్ష్మీనర్సింహారావు, వెంకట్ రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, నవీన్, శంకర్ పాల్గొన్నారు.

తక్కువ ధరకు బంగారమంటూ బురిడీ

● స్థానికులను మోసం చేసిన దంపతుల అరెస్టు



నిందితులను మీడియాకు చూపిస్తున్న ఎస్సై పవన్‌కుమార్

పాలకుర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : తక్కువ ధరకే బంగారం ఇస్తానంటూ స్థానికుల ను బురిడీ కొట్టించి లక్షలు కాజే సిన ఘటనలో భార్యాభర్తలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిం చినట్లు ఎస్సై దూలం పవన్ కుమార్ తెలిపారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో మీడియా సమావేశంలో ఎస్సై మాట్లాడారు. గూడూరుకు చెందిన సింగపురం గౌరమ్మ, ఆమె భర్త వెంకటయ్యలు గ్రామంలో కొత్త ఇల్లు నిర్మించుకున్నారు. ఇంటి నిర్మాణానికి పెద్ద మొత్తంలో ఖర్చు కాగా, తమ ఇంట్లో లంకె బిందెలు ఉన్నాయని నమ్మించి అమాయకుల నుంచి డబ్బులు వసూల్ చేయాలని ప్లాన్ వేసింది. అదే క్రమంలో గ్రామానికి చెందిన మంద రజిత, బొమ్మగాని పద్మలను తన మాస్టర్ ప్లాన్‌కు ఎంచుకున్నారు. వారిని కలిసి తాను కొత్తగా నిర్మించుకున్న ఇంటిలో లంకె బిందెలు దొరికాయని దానిలో పెద్ద మొత్తంలో బంగారం దొరికిందని తెలిపారు. మీరు ఆప్తులు కాబట్టి మార్కెట్లో ఉన్న ధర కంటే తక్కువ ధరకు బంగారం ఇస్తానని, మీ అదృష్టం మారుస్తానని ఇరువురి మహిళలను నమ్మబలికారు. బంగారంపై ఆశతో అమాయక మహిళలు అందిన కాడల్లా అప్పులు చేసి బొమ్మగాని పద్మ రూ.4.74 లక్షలు, మంద రజిత రూ. 6లక్షల 7 వేలు, గాదం జయమ్మ రూ.5.93 లక్షలను గౌరమ్మకు ముట్టచెప్పారు. జఫర్‌గడ్ మండలంలోని కోనాయిచలంకు చెందిన నలుగురు మహిళల నుంచి రూ.15 లక్షలు తీసుకున్నారు. డబ్బులు ఇచ్చిన తర్వాత బంగారం కోసం అడుగుతుంటే దాటవేసే సమాధానాలు చెబుతూ కాలం వెళ్లబుచ్చారు. దీంతో మోసపోయామని భావించిన మహిళలు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. గౌరమ్మపై గతంలోనూ పలు కేసులు ఉన్నాయని తెలిపారు. మంద రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రైతులకు సబ్సిడీపై స్ప్రేయర్లు

దంతాలపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులకు తెలంగాణ ప్రభుత్వం సబ్సిడీపై తైవాన్ స్ప్రేయర్లు పంపిణీ చేయనుందని ఏఈవో దీక్షిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసక్తి గల రైతులు మండలంలోని వ్యవసాయాధికారి కార్యాలయం దంతాలపల్లిలో దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, రెండు ఫోటోలు అందించాలన్నారు. హోండా తైవాన్ స్ప్రేయర్‌కు రూ.23,900 ఉండగా ప్రభుత్వం సబ్సిడీపై రూ.13,900కు అందిస్తుందన్నారు. ఆసక్తి గత రైతులు వెంటనే ఏఈవోలను సంప్రదించాలన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి మహాధర్నా

తొర్రూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందని, వెంటనే జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు అన్నారు. శుక్రవారం తొర్రూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణలో అత్యంత నిరాధారణకు గురైంది జర్నలిస్టులే అన్నారు. సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని అనేక దఫాలు కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరినా హామీ ఇస్తున్నారే తప్ప సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ డిసెంబర్ 3వ తేదీ హైదరాబాద్‌లోని సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాకు జర్నలిస్టులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. ధర్నా కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ కౌన్సిల్ సభ్యుడు దూలం శ్రీనివాస్, జర్నలిస్టులు బిజ్జాల వెంకటరమణ, కృష్ణ, సురేష్, శ్రీకాంత్, రామకృష్ణ, వీరన్న, కార్తీక్, వీరాంజనేయులు, దయాకర్, శ్రీనివాస్, భాస్కర్, రాంమూర్తి పాల్గొన్నారు.

ఓపెన్ కాస్ట్ ఎదుట భూనిర్వాసితుల ఆందోళన


ఆందోళనకారులతో మాట్లాడుతున్న సింగరేణి జీఎం ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి

కృష్ణకాలనీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఓసీ-2 ఎదుట భూనిర్వాసితులు, రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఓసీ ప్రభావిత గ్రామాలైన ఆకుదారివాడ, ఫక్కీర్‌గడ్డ, కాకతీయకాలనీ, మదీనాకాలనీ, హనుమాన్‌నగర్ ప్రాంతాల వారు ర్యాలీ తరలివచ్చి ఓసీ-2 ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి నిరసనకు దిగారు. తమ గ్రామాలను అక్కడి నుంచి తరలించి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. భూనిర్వాసిత నేతలు బుర్ర రమేష్‌గౌడ్, బుర్ర మనోజ్‌గౌడ్ మాట్లాడుతూ 2017లో సింగరేణి ఓసీ-2లో భాగంగా 50 ఎకరాల భూములను తీసుకుందన్నారు. నేటి వరకు నష్ట పరిహారం ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. గ్రామాలను మొత్తం తీసుకోకుండా కొంత మేరకే తీసుకున్నారని, దీంతో ఓసీ బ్లాస్టింగ్ వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తోందని అన్నారు. అధికారులు స్పందించేంత వరకు ఆందోళన విరమించబోమని భీష్మించి కూర్చున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు, సింగరేణి సెక్యూరిటీ అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ససేమిరా అన్నారు. ఓసీ-2లోనికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో భూనిర్వాసితులు, పోలీసుల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. అనంతరం సింగరేణి జీఎం ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి అక్కడకు చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో భూనిర్వాసితులు శాంతించారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు బుర్ర రాజయ్య, సంధ్య, మణి, ఆవదాల రమేష్, ఇస్లావత్ సమ్మయ్య, తిరుపతి, వడ్లకొండ రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం పాటించిన కాంగ్రెస్

బీసీ జేఏసీ చైర్మన్ పైడిపల్లి రమేష్


భట్టు కర్ణాకర్‌ను సన్మానిస్తున్న బీసీ జేఏసీ నాయకులు

భూపాలపల్లిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా అధ్యక్ష పదవి ఎంపికలో కాంగ్రెస్ అధిష్ఠానం సామాజిక న్యాయం పాటించిందని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ పైడిపల్లి రమేష్ అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భట్టు కర్ణాకర్‌ను బీసీ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ జిల్లాలో అధ్యక్ష పదవికి పలువురు బరిలో ఉన్నప్పటికీ అధిష్ఠానం మాత్రం యువతకు ప్రాధాన్యమిచ్చిందన్నారు. బీసీ జేసీ నాయకుడు గట్ల రాజన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి అంబాల చంద్రమౌళి మాట్లాడుతూ దళితుడికి అధ్యక్ష పదవి ఇచ్చిన పార్టీ సామాజిక న్యాయానికి అద్దం పట్టిందని అన్నారు. యూత్‌ను ముందుకు తీసుకువెళ్లడం అంటే అభివృద్ధి వైపు అడుగులు వేయడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలగోని రమేష్, దాట్ల శ్రీనివాస్, చల్లూరి సమ్మయ్య, జోగు బుచ్చయ్య, ముంజాల రవీందర్, సమ్మయ్య, రవి, సాంబమూర్తి, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

పది మంది రౌడీషీటర్ల బైండోవర్

మొగుళ్లపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్సిపేట, పాత ఇస్సిపేట గ్రామాలకు చెందిన పది మంది రౌడీషీటర్లను స్థానిక తహసీల్దార్ సునీత ఎదుట శుక్రవారం బైండోవర్ చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తుగా ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు.

గోవిందరావుపేట మండలంలో..

గోవిందరావుపేట (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా మండలంలోని పదిమంది రౌడీషీటర్లను శుక్రవారం స్థానిక తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పస్రా ఎస్సై కమలాకర్ తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

మేడారంలో 'ముందస్తు' సందడి

● భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు


వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

తాడ్వాయి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో శుక్రవారం సందడి నెలకొంది. వనదేవతలను దర్శించుకొనేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మహా జాతరకు మరో 60రోజుల సమయం ఉండడంతో ముందుగానే కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసివచ్చి తల్లుల గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు ఐదువేలకు పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవస్థానం అధికారులు తెలిపారు.

- దేవస్థానంలో ఎలక్ట్రిక్ పనులకు ప్రణాళికలు

మేడారం దేవస్థానం మాస్టర్ ప్లాన్ పనుల్లో భాగంగా ఎలక్ట్రిక్ పనులకు అధికారులు శుక్రవారం కార్యాకరణను రూపొందించారు. వందల సంవత్సరాలు నిలిచేలా శాశ్వత ప్రతిపాదికన నిర్మిస్తున్న మేడారం దేవస్థానంలో విద్యుత్ ఏర్పాట్లకు ఆర్కిటెక్చర్లు ప్రత్యేక ప్రణాళికను తయారు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


భిక్షపతి (ఫైల్)

రేగొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హనుమకొండ జిల్లా నడికుడ మండలంలోని చర్లపల్లికి చెందిన మోరె భిక్షపతి (30), అదే గ్రామానికి చెందిన మరో ఇద్దరితో కలిసి ములుగు నుంచి రేగొండ వైపు బైక్‌పై బయల్దేరారు. ఈ క్రమంలో బైక్ అదుపు తప్పి కిందపడిపోయారు. బైక్ నడుపుతున్న భిక్షపతి అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని ఆస్పత్రికి తరలించినట్టు ఎస్సై దివ్య తెలిపారు.

మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్య

మొగుళ్లపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని రంగాపురం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని శ్రీరాం రాజీరు(68) భార్య నాలుగేళ్లక్రితం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో అతడు అప్పటి నుంచి మనోవేదనతో ఉంటున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తిచెంది మతిస్థిమితం కోల్పోయాడు. శుక్రవారం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు పరకాలలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే రాజీరు మృతిచెందాడు. మృతుడి కుమారుడు రఘుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం చిట్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై వివరించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	6940	6300
మక్కలు	1821	1521
కందులు	----	----
పెసళ్లు	----	----
పల్లికాయ (సూక)	----	----
పల్లికాయ (పచ్చిది)	----	----
పసుపు (కాడి)	----	----
పసుపు (గోల)	----	----
తేజ మిర్చి	----	----
తేజ మిర్చి ఏసీ	14700	9500
వండర్‌హాట్	----	----
వండర్‌హాట్ ఏసీ	19000	12000
యూఎస్341ఏసీ	17250	9000
దీపిక	----	----
సింగిల్‌పట్టి ఏసీ	----	----
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

లక్ష్యం వైపు దూసుకెళ్లాలి



స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న రామమూర్తి, సమీర్ వి కామత్

- ఏఐతో బోధనలో మార్పులు అవసరం
- మైక్రాన్ ఇండియా వైస్ చైర్మన్ రామమూర్తి
- ఘనంగా వరంగల్ నిట్ 23వ స్నాతకోత్సవం
- 1,913 మందికి పట్టాల ప్రదానం

హనుమకొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విజయం అనేది నిచ్చెన మెట్ల వంటిదని, కష్టపడి చదవడం, కష్టించి పని చేయడం, లక్ష్యం వైపు స్థిరంగా దూసుకువెళ్లడం ద్వారానే అది సాధ్యమవుతుందని మైక్రాన్ ఇండియా, మైక్రాన్ టెక్నాలజీ ఆపరేషన్ ఇండియా ఎల్ఎల్‌పీ వైస్ ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్ రామమూర్తి అన్నారు. వరంగల్ ఎన్ఐటీలో శుక్రవారం 23వ స్నాతకోత్సవం కనులపండువగా జరిగింది. క్యాంపస్‌లోని అంబేద్కర్ లర్నింగ్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఆనంద్ రామమూర్తి ముఖ్య అతిథి, 'డిఫెన్స్ ఆర్ అండ్ డీ విభాగం సెక్రటరీ, డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు.

వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ స్నాతకోత్సవంలో 1913 మందికి పట్టాలు ప్రదానం చేశారు. వీరిలో 953 మంది బీటెక్, 556 మంది ఎంటెక్, 149 మంది ఎంఎస్సీ, 38 మంది ఎంబీఏ, 56 మంది ఎంసీఏ విద్యార్థులు, 142 మంది పీహెచ్‌డీ స్కాలర్లు, 19 మంది బీఎస్సీ, బీఎస్సీ (హానర్స్), ఇంజనీరింగ్‌లో పీజీ డిప్లొమా విద్యార్థులు ఉన్నారని తెలిపారు. వీరితో పాటు ప్రతీ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లో బీటెక్‌లో టాపర్‌గా నిలిచిన 14 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రదానం చేశారు. ముగ్గురు విద్యార్థులు డైరెక్టర్స్ గోల్డ్ మెడల్స్ అందుకున్నారు. ఓవర్ ఆల్ టాపర్‌గా పాలచర్ల శ్రీసత్య నవీన్, కొండ సౌమ్య, రోహన్ గుప్తా ఉన్నారు. బీటెక్ ప్రాజెక్టు అవార్డును మీర్ రహమాన్, ఎంటెక్ డిసెర్టేషన్ అవార్డు ఆయోషా దాంగే, పీహెచ్‌డీ థీసిస్ అవార్డు డాక్టర్ నిఖిల్ భరత్ అందుకున్నారు.



నిట్ అధ్యాపకులతో ముఖ్య అతిథులు

ఈ సందర్భంగా ఆనంద్ రామమూర్తి మాట్లాడుతూ.. మనం సాఫీగా ముందుకు వెళ్లడానికి జీవితం జీపీఎస్ (గ్లోబల్ నావిగేషన్ వ్యవస్థ) కాదని, మన వెళ్లేదారిలో డొంకలు, ఎత్తుపల్లాలు, సుదీర్ఘ నిశ్శబ్ద పయనాలు ఉంటాయన్నారు. వీటిని మనం ఎట్లా దాటుకుంటూ వెళతామో అదే మనమేమిటనేది నిర్ణయిస్తుందని అన్నారు. అర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ)ని ఆవిష్కరణలకు వేదికగా చూడాలన్నారు. ప్రతిభ ఒక్కటే ముఖ్యంకాదని, నైపుణ్యాల కన్నా ముందు మానవ సంబంధాలను నిర్మించుకోవాలని ఉద్బోధించారు. ఏఐ ఒక కొత్త బేస్‌లైన్, ఈ విశాలమైన సాంకేతిక మైదానంలో దానిని అందిపుచ్చుకోవడానికి మరింత కృషి చేయాలన్నారు. ఏఐని ఒక ముప్పుగా చూడరాదని, దీనిని ఒక ప్రయోగవేదికగా భావించాలని సూచించారు. ఏఐ నేపథ్యంలో పట్టభద్రుల బోధనలో తదనుగుణంగా మార్పులు చేయాలన్నారు.

డిఫెన్స్ ఆర్‌అండ్‌డీ సెక్రటరీ, డీఆర్‌డీవో చైర్మన్ మాట్లాడుతూ.. రక్షణ రంగంలో దేశం స్వావలంబన సాధించిందని, ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనే సత్తాను సాధించిందన్నారు. ఇటీవలి ఆపరేషన్ సింధూర్‌ను ప్రస్తావిస్తూ శత్రువులపై విజయం సాధించడం వెనుక డీఆర్‌డీఏ భూమిక కీలకంగా ఉందన్నారు. ప్రస్తుతం డీఆర్‌డీవోలో సేవలందిస్తున్న డైరెక్టర్ జనరల్స్ ఇద్దరు ఎన్ఐటీ పూర్వ విద్యార్థులనేనని గుర్తు చేశారు.

కాగా, నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి నిట్ ప్రగతిపై నివేదికను సమర్పించారు. అత్యున్నత విద్యా ప్రమాణాలతో వరంగల్ నిట్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అగ్రగామిగా నిలిచిందన్నారు. 2025-26 సంవత్సరంలో రికార్డు స్థాయిలో ప్లేస్‌మెంట్లు, రూ.45.65కోట్ల విలువైన 118 రిసెర్చ్ ప్రాజెక్టులు, 51 కొత్త పేటెంట్లు సీఐఐఈ ద్వారా పెరుగుతున్న స్టార్టప్‌లు నిట్ ఔన్నత్యానికి నిలువెత్తు ప్రతీకలన్నారు.

ఇద్దరికి అత్యున్నత పురస్కారాలు

వరంగల్ నిట్ చరిత్రలో మొదటిసారిగా ఇద్దరికి అత్యున్నత పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్టు నిట్ డైరెక్టర్ తెలిపారు. సాయుధ దళాల కోసం దేశవాళీ రక్షణ వ్యవస్థలను, అధునాతన సాంకేతికతలను అభివృద్ధి చేయడంలో విశేషంగా కృషి చేసినందుకు గాను డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ వి.సమీర్ కామత్ కు గౌరవ డాక్టరేట్‌ను, అలాగే దేశానికి భద్రత, సస్టేనబుల్ ఎనర్జీ ట్రాన్స్‌ఫార్మేషన్‌లో కీలక భూమిక పోషించినందుకుగాను గుర్తింపుగా ఎస్.వేణుకు డక్టార్ ఆఫ్ ఫిలాసఫీ (హానరీస్ కాసా) ప్రదానం చేస్తున్నట్టు తెలిపారు.

సమీర్ కామత్‌కు డాక్టరేట్



- వేణుకు డాక్టర్ ఆఫ్ పిలాసఫీ
- నిట్ చరిత్రలో మొదటిసారి ప్రదానం

హనుమకొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్ 23వ స్నాతకోత్సవం సందర్భంగా డిఫెన్స్ ఆర్‌అండ్‌డీ విభాగం సెక్రెటరీ, డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్‌కు డాక్టర్ ఆఫ్ సైన్స్‌ను, హిటాచి సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.వేణుకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీని ప్రదానం చేశారు. ఆయా రంగాల్లో చేసిన విశిష్టసేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాలను ప్రదానం చేయడం వరంగల్ నిట్ చరిత్రలో ఇదే మొదటి సారి. రక్షణ రంగంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా డాక్టర్ కామత్‌కు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. డాక్టర్ సమీర్ వి కామత్ డీఆర్‌డీవోలో అపార అనుభవం ఉన్న ప్రతిభావంతులైన శాస్త్రవేత్త ఆయన మెటీరియల్ సైన్స్, నావల్ సిస్టమ్స్‌లో మార్గదర్శక కృషికి నాయకత్వం వహించారు. ముఖ్యంగా 2009లో స్వదేశీ స్టెల్త్ టెక్నాలజీల అభివృద్ధికి, నావికావేదికల కోసం ఆధునాతన మిశ్రమాలకు రూపకల్పన చేశారు. నావల్ సిస్టమ్స్, మెటీరియల్ డైరెక్టర్ జనరల్‌గా, భారతదేశ సముద్ర రక్షణను బలోపేతం చేసే కీలకమైన ఆవిష్కరణలను ఆయన పర్యవేక్షించారు. ఇండియన్ నేషనల్ అకాడమీ ఆఫ్ ఇంజనీరింగ్, ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియాలో ఫెలో అయిన కామత్ దార్శనిక నాయకత్వంలో డీఆర్‌డీవో స్వావలంబనను సాధించి రక్షణ పరిశోధనలో ప్రపంచ స్థాయి కీర్తిని గడించింది. కాగా, ఎస్.వేణు భారత సుస్థిర ఇంధనరంగానికి చేసిన విశిష్టమైన సేవలకు గుర్తింపుగా డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ ప్రదానం చేశారు.



నిట్ క్యాంపస్‌లో పట్టభద్రుల సందడి

సంబురంగా స్నాతకోత్సవం

- పండుగ వాతావరణం తలపించిన నిట్ క్యాంపస్

హనుమకొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్ 23వ స్నాతకోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. నిట్ క్యాంపస్‌లోని అంబేద్కర్ లర్నింగ్ సెంటర్‌లో స్నాతకోత్సవం సరిగ్గా ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైంది. అంతకన్నా ముందు పట్టభద్రులు, గోల్డ్‌మెడలిస్టులు ఒక క్యూపద్ధతిలో సెంటర్‌కు చేరుకున్నారు. ఉదయం 10.32 గంటలకు జాతీయ గీతాలాపన జరిగింది. 10.33గంటలకు చైర్మన్, సెనెట్ 23వ స్నాతకోత్సవం ప్రారంభమైనట్టు ప్రకటించారు. 10.34 గంటలకు నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి నివేదిక చదివారు. 10.49 గంటలకు ముఖ్య అతిథి ఆనంద్ రామమూర్తి స్నాతకోపన్యాసం చేశారు. 11.19 గంటలకు గౌరవ డాక్టరేట్, పీహెచ్‌డీ డిగ్రీల ప్రదానం జరిగింది. 11.21 గంటలకు డీఆర్‌డీవో చైర్మెన్ డాక్టర్ సమీర్ వి కామత్ ప్రసంగించారు. 11.31 నుంచి మధ్యాహ్నం 1.12 గంటల వరకు పట్టాల ప్రదానం జరిగింది. 1.15 గంటలకు పట్టభద్రులతో ప్రతిజ్ఞ చేయించారు. 1.20 గంటలకు అతిధులకు సత్కారం జరిగింది. 1.23 గంటలకు స్నాతకోత్సవం ముగిసింది.

కళకళలాడిన క్యాంపస్

స్నాతకోత్సవానికి హాజరైన పట్టభద్రులు, వారి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులతో నిట్ క్యాంపస్ కిటకిటలాడింది. స్నాతకోత్సవం నిర్వహించిన ఎఎల్‌సీ హాల్ పూర్తిగా పట్టభద్రులతో నిండిపోయింది. దీనితో స్థలం చాలక మీడియాతో సహా ఇతరులెవరినీ లోపలికి అనుమతించలేదు. దీంతో తమ పిల్లలు పట్టాలు స్వీకరిస్తుండగా ప్రత్యక్షంగా చూడాలని వచ్చిన తల్లిదండ్రులు, వారి కుటుంబ సభ్యులు బయటనే వేచిచూడాల్సి వచ్చింది. అయితే వీరికోసం కాంప్లెక్సు సెమినార్ హాల్‌లో, ఇతరచోట్ల నాలుగు చోట్ల డిజిటల్ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. హాళ్లలో స్థలం సరిపోకపోవడంతో చాలామంది నిలబడే వీక్షించాల్సి వచ్చింది.

'పంచాయతీ'

అభ్యర్థుల గుర్తులు ఇవే..

రఘునాథపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మొదటి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం రెండో రోజుకు చేరుకుంది. ఎన్నికల సంఘం సర్పంచ్ అభ్యర్థులకు 30, వార్డు సభ్యులకు 20గుర్తులు కేటాయించింది. సర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు వేర్వేరుగా ఎన్నికల గుర్తులు కేటాయించారు. సర్పంచ్ బ్యాలెట్‌తోపాటు వార్డు సభ్యుల బ్యాలెట్‌లో నోటా గుర్తు ఉంటుంది. సర్పంచ్ బ్యాలెట్ పేపర్ గులాబీ రంగులో వార్డు సభ్యుల బ్యాలెట్ పేపర్ తెలుపు రంగులో ఉండనుంది.

సర్పంచ్ గుర్తులు..

ఉంగరం (రింగు), కత్తెర, బ్యాట్, ఫుట్‌బాల్, లేడీస్ పర్సు, టీవీ రిమోట్, టూత్ పేస్ట్, స్పానర్(పానా), చెత్త డబ్బా, బ్లాక్ బోర్డు, కొబ్బరితోట, బెండకాయ, వజ్రం, బకెట్, డోర్ హ్యాండిల్, చాయ్‌జాలీ, చేతి కర్ర, మంచం, పలక, టేబుల్, బ్యాటరీలైట్, బ్రష్, బ్యాట్స్‌మెన్, పడవ, బిస్కెట్, ఫ్లూట్, చైన్, చెప్పులు, బెలూన్, స్టంప్స్ గుర్తులు కేటాయించారు.

- వార్డు సభ్యులకు..

గౌను, గ్యాస్‌పొయ్యి, స్టూల్, గ్యాస్ సిలిండర్, బీరువా, విజిల్(ఈల), కుండ, డిష్ యాంటినా, గరాట (గౌర), మూకుడు, ఐస్‌క్రీమ్, గాజు గ్లాసు, పోస్టు డబ్బా, కవర్, హాకీ స్టిక్ బాల్, నెక్‌టై, కటింగ్ ప్లేయర్, పెట్టె, విద్యుత్తు స్తంబం, టీ కెటిల్ గుర్తులు కేటాయించారు.

ఎన్నికల ఖర్చు పరిమితి దాటొద్దు..

పంచాయతీ ఎన్నికలలో పోటీ చేసే సర్పంచ్, వార్డు సభ్యులకు ఎన్నికల ఖర్చు పరిమితి విధించారు. 5వేల జనాభా పైబడిన గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు రూ.2.50 లక్షలు, వార్డు సభ్యులకు రూ.50 వేలు, 5 వేల జనాభా లోపు ఉన్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు రూ.1.50 లక్షలు, వార్డు సభ్యులు రూ.30 వేలకు మించి ఖర్చు చేయరాదు. సర్పంచ్, వార్డు సభ్యులు తప్పనిసరిగా బ్యాంకు లేక పోస్ట్ ఆఫీసులో ఖాతా తీసుకోవాలి. ఎన్నికల ఖర్చును బ్యాంకు ఖాతా ద్వారానే చూపించాలి. అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై అధికారుల నిఘా ఉంటుంది.

సర్పంచ్ పదవి కోసం

కొలువులకు రాజీనామా

మహబూబాబాద్ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండలం సోమ్లతండా అంగన్‌వాడీ టీచర్, లక్ష్మాతండా శివారు వెంక్యతండా అంగన్‌వాడీ ఆయా తమ ఉద్యోగాలకు రాజీనామా చేస్తూ శుక్రవారం సీడీపీవో శిరీషకు పత్రాలను అందజేశారు. సోమ్లాతండా అంగన్‌వాడీ టీచర్ భూక్య కౌసల్య సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. లక్ష్మాతండా శివారు వెంక్యతండాలో అంగన్‌వాడీ ఆయాగా విధులు నిర్వహిస్తున్న బోడ నీలా లక్ష్మాతండా సర్పంచ్‌గా పోటీచేసేందుకు ఉద్యోగానికి రాజీనామా చేశారు.

అటు ఇష్టం.. ఇటు కష్టం..

(5వ పేజీ తరువాయి)

ఒక్కొక్క అభ్యర్థికి రూ.20 లక్షల పైమాటే అనే టాక్ ఉంది. ఇక రెండు వేలకు పైగా ఓటర్లు ఉంటే రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షలు.. ఆపైన కూ డా ఖర్చు పెరుగుతుందనే చర్చ ఉంది. ఖర్చులే కాకుండా సొంత పార్టీ నుంచి పోటీకి దిగుతున్నవారిని తప్పించేందుకు లక్షల్లో చేతిలో పెట్టాల్సిందే.

అయితే మరోవైపు ఏకగ్రీవం ఆశావహులను ఊరిస్తోంది. ఎవరితో పోటి లేకుండా ప్రచార లొల్లి, ఖర్చుల బాధ లేకుండా సర్పంచ్ సీటులో కూర్చోవచ్చునని ఉవ్విళ్లురుతున్నవారు కూడా ఉన్నారు. అయితే ఏకగ్రీవం పేరుతో ఊరి అభివృద్ధికి, పోటీ నుంచి తప్పుకునేవారికి, చివరికి ఓటర్లకు దావత్.. ఇలా ఖర్చుల మీద ఖర్చులు తప్పవనే ప్రచారం ఉంది. ప్రతీ పనికి పైస కావాల్సిందే. పంచాయతీ ఎన్నికల్లో పైసా లేనిది ప్రచారం లేదని.. క్యాడర్ ఉండరనే ఆందోళనలో అభ్యర్థులు ఉన్నారు. దీంతో చేతిలో చిల్లీగవ్వ లేకున్నా.. మద్దతుదారుల ప్రోత్సాహంలో సర్పంచ్ బరిలో దిగుతున్న అభ్యర్థులను కాసుల కష్టాలు కలవరపెడుతున్నాయి. జనరల్‌స్థానాల్లో ఖర్చు ఎక్కువ ఉండే అవకాశం ఉండటంతో అభ్యర్థులు ప్రత్యర్థులకు దీటుగా వ్యూహరచనలు చేస్తున్నారు.

సర్దుబాటుకు తంటాలు

పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేస్తున్నాననే ఆనందం ఒకవైపు.. ఎన్నికల ఖర్చులకు అప్పు ఎట్లా అనే ఆందోళన మరోవైపు అభ్యర్థులను కలవర పరుస్తోంది. తెలిసినోళ్లందరికీ ఫోన్ చేసి అప్పు కోసం బతిమిలాడాల్సి వస్తోంది. 'అన్నా.. సర్పంచ్ ఎన్నికల్లో ఎమ్మెల్యే సపోర్టు చేస్తుండు.. నా కాడ ఐదారు లక్షలున్నాయి.. నీ దగ్గర ఐదో ఆరో లక్షలు ఉంటే సర్దు అన్నా.. ఎన్నికలయ్యాక ఏటలో తేర్చుతా' అంటూ రిక్వెస్టులు చేస్తున్నారు. అభ్యర్థులు వడ్డీ వ్యాపారులను కూడా ఆశ్రయిస్తున్నారు.

అయితే తాజా మాజీ సర్పంచుల అనుభవాలను చూసిన వ్యాపారులు, పెట్టుబడిదారులు కూడా ఎన్నికల కోసం అప్పు ఇచ్చేందుకు ససేమేరా అంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సర్పంచ్‌లు వైకుంఠధామాలు, డపింగ్‌యార్డులు, నర్సరీలు, రైతు వేదికలు తదితర వాటిని నిర్మించారు. వీరి పదవీకాలం పూర్తయ్యే వరకు సుమారు రూ.330కోట్ల వరకు నిధులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రతీ సర్పంచ్ సుమారుగా రూ.2లక్షల నుంచి రూ.50లక్షల వరకు పెట్టుబడి పెట్టి పనులు చేసి, బిల్లుల కోసం నిరీక్షిస్తున్నారు. ఏడాదిన్నర కాలంగా ప్రభుత్వం కొంత కొంత చెల్లిస్తూ వస్తోంది. మాజీ సర్పంచుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అప్పులు ఇచ్చేందుకు ఎవరూ ఆసక్తి చూపటం లేదనే చర్చ జరుగుతోంది. దీంతో ఎన్నికల ఖర్చులు సర్దుబాటు కోసం అభ్యర్థులు నానా తంటాలు పడుతున్నారు. కొందరు తమ భూములను తాకట్టే పనిలో ఉండగా, మరికొందరు భార్య, పిల్లలు, తల్లికి సంబంధించిన బంగారు అభరణాలను తాకట్టు పెడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువమంది రైతులే ఉండటంతో వారి ఆదాయం కూడా పంటలపైనే. అయితే ఆశించిన స్థాయిలో పంటల దిగుబడి, గిట్టుబాటు ధరలు లేక రైతాంగం ఆర్థికంగా చితికిపోయింది. ఈ క్రమంలో అప్పులు తప్ప వేరేదారి కనిపించటం లేదని కొందరు ఆశావహులు వాపోతున్నారు. అయితే లక్షలాది రుపాయలు ఖర్చు చేసి పోటీ చేస్తే మిగిలేది ఏమిటనే ఆలోచనలో మరి కొందరు ఉన్నారు. తాజా మాజీ సర్పంచ్‌లు పడుతున్న కష్టాలను దృష్టిలో ఉంచుకుని, వృథా ఖర్చులు లేకుండా పోటీ చేయాలని అభ్యర్థుల కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఒత్తిడి తెస్తున్నారు.

కేసీఆర్ పోరాట ఫలితమే 'తెలంగాణ'

- మాజీ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్

హనుమకొండ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ పోరాట ఫలితంగానే తెలంగాణ స్వరాష్ట్రం సాధ్యమైందని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద దీక్షా దివస్ పోస్టర్ ఆవిష్కరించారు. శనివారం దీక్ష దివస్‌ను పురస్కరించుకొని హనుమకొండ నక్కలగుట్టలోని కాళోజీ విగ్రహం వద్ద కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వినయ్ భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ పోరాట స్ఫూర్తితో 60 ఏళ్ల తెలంగాణ రాష్ట్రం సాకరమైందన్నారు. సాధించుకున్న తెలంగాణలో కేసీఆర్ పదేళ్ల నాయకత్వంలో దేశంలోనే నంబర్ వన్ స్థానానికి తీసుకెళ్లారని అన్నారు. శనివారం నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంతరావు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, చెన్నం మధు, సంకు నర్సింగరావు, బోయినపల్లి రంజిత్‌రావు,ఇమ్మడి లోహితరాజు, బీఆర్ఎస్ నాయకులు జోరిక రమేష్, కంజర్ల మనోజ్‌కుమార్, పోలెపల్లి రాంమూర్తి, తక్కళ్లపెల్లి వినిల్‌రావు, వరంగల్ పశ్చిమ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి ఆలయ

సమగ్రాభివృద్ధి ఎప్పుడో ?

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టి పెట్టాలంటున్న భక్తులు



వరంగల్ కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రముఖ శక్తిపీఠాల్లో ఒకటిగా భద్రకాళి దేవాలయం ప్రసిద్ధి గాంచింది. ఏడాదిలో నాలుగు బ్రహ్మోత్సవాలు జరిగే ఏకైక దేవాలయం ఇదే కావడం విశేషం. చైత్ర మాసంలో వసంత నవరాత్రులు, వైశాఖ మాసంలో కల్యాణ బ్రహ్మోత్సవాలు, ఆషాఢ మాసంలో శాకంబరీ నవరాత్రులతో పాటు దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు, వాహన సేవలు వైభవంగా కొనసాగుతాయి. కాళీమాత, భద్రకాళి మాత తేజో లింగంగా విరాజిల్లుతున్న భద్రేశ్వరుడి సమేతంగా నిత్యం వేలాది మందితో కిటకిటలాడే భద్రకాళి ఆలయానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి పర్చాలని భక్తులు కోరుతున్నారు.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ సైతం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దేశంలోని వివిధ ధార్మిక సంస్థలు, పీఠాధిపతులు, స్వామిజీలు, గవర్నర్లు, ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, అధికారులు సైతం అమ్మవారిని దర్శించుకున్నారు. తెలంగాణకే తలమానికంగా నిలిచిన భద్రకాళి అమ్మవారికి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం అప్పటి ప్రభుత్వం బంగారు కిరీటం సమర్పించింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 30 కోట్లు నిధులు కేటాయించి మాడవీధుల నిర్మాణం చేపట్టింది. పనులు కొనసాగుతున్నాయి.

ప్రత్యేక కారిడార్

ప్రపంచ ప్రసిద్ధి గాంచిన తిరుపతి వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి నాలుగు మాడవీధులు ఉన్నాయి. తమిళనాడులోని ప్రసిద్ధ శైవ క్షేత్రమైన అరుణాచలంలో అతి పెద్ద రాజగోపురాలు నిర్మాణమై ఉన్నాయి. దేశంలోని ఈ రెండు క్షేత్రాల నమూనాలో వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారి దేవస్థానానికి నాలుగు మాడవీధుల నిర్మాణం కొనసాగుతోంది. రాజగోపురాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారే కాని పనులు ముందుకు సాగడం లేదు. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి కారిడార్‌గా గుర్తించాలని భక్తులు కోరుతున్నారు. శనివారం కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి నగరానికి వస్తున్న సందర్భంగా భద్రకాళి ఆలయ సమగ్ర అభివృద్ధికి చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. రాజగోపురాలతో పాటు ప్రత్యేక అతిథి గృహం, భక్తుల కోసం విశ్రాంతి గృహాలు, కాటేజీల నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏళ్లుగా తిష్ఠ.. జీడబ్ల్యూఎంసీకి అప్రతిష్ఠ

- పాతుకుపోయిన ఉద్యోగుల ప్రక్షాళనకు కమిషనర్ శ్రీకారం
- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఇష్టారాజ్యం
- దీర్ఘకాలికంగా ఒకేచోట విధులు
- స్థానచలనంపై ముమ్మరంగా కసరత్తు

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జీడబ్ల్యూఎంసీని అంటిపెట్టుకుని కాలం వెళ్లదీస్తున్న ఉద్యోగులు ఇకపై బదిలీపై వెళ్లాల్సిందే. దీనిపై కొంత కాలంగా జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు సర్కిల్ కార్యాలయాల్లో కమిషనర్ ప్రక్షాళన ప్రారంభించారు. జీడబ్ల్యూఎంసీ పరిధిలోని 12 వింగ్‌లలో చాలాకాలంగా పాతుకుపోయిన 4వ తరగతి ప్రభుత్వ, ప్రైవేటు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను గుర్తించే పనిలో పడ్డారు. కమిషనర్ ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ యుద్ధ ప్రాతిపదికన సిబ్బందిని గుర్తించి జాబితా సిద్ధం చేశారు. కొద్దిరోజుల్లో కొందరికి స్థానచలనం కలగవచ్చనే భావిస్తున్నారు.

బల్దియాను అడ్డాగా చాలామంది సిబ్బంది తూతూ మంత్రంగా పని చేసి నెలకు ఠంచన్‌గా జీతం తీసుకునేవారు కొందరైతే అసలు కార్యాలయానికి రాకుండా అడ్డదారిలో బయోమెట్రిక్, ఫేస్ ఐడెంటిఫికేషన్ హాజరు వేసుకుని జీతం తీసుకుంటున్నట్టు కమిషనర్‌కు పక్కా సమాచారం అందింది. దీంతో వారం రోజుల నుంచి బల్దియా అడ్డదారి ఉద్యోగుల గుర్తింపుపై ప్రక్షాళన చేశారు. జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్ ప్రభుత్వ, ప్రైవేటు, ఔట్‌సోర్సింగ్ (పీహెచ్) పబ్లిక్ హెల్త్ వర్కర్లను తన కార్యాలయానికి ఒక్కొక్కరిని పిలుచుకుని పూర్తి వివరాలను సేకరించారు. మరో రెండు రోజులు పాటు కాజీపేట, కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయాలకు వెళ్లి అక్కడ కూడా లాంగ్ స్టాండింగ్ ఉద్యోగుల డాటా సేకరించినట్టు ఉద్యోగులు తెలిపారు.

ఎప్పటి నుంచి పని చేస్తున్నారు? ఏ హోదాలో పని చేస్తున్నారు? ఎంత వరకు చదువుకున్నారు? చదువుతో పాటు టెక్నికల్ కోర్సులు ఏమైనా చేశారా? కుటుంబ నేపథ్యంపై వివరాలు సేకరించినట్టు తెలిసింది. పీహెచ్ వర్కర్లుగా విధుల్లో చేరిన వారు కార్యాలయాల్లో ఎందుకు తిష్ఠ వేశారు? అని ప్రశ్నించి శానిటేషన్ పనులు చేయాల్సి వస్తే వెళ్లాల్సి ఉంటుందని ఏసీ చెప్పినట్టు ఉద్యోగులు తెలిపారు. తాము ఇంత కాలం ఉద్యోగం చేసినా చేయకపోయినా జీతం తీసుకునేది ఇప్పుడు కొత్త పద్ధతి ఏమిటని కొందరు అధికారుల తీరుపై పెదవి విరుస్తున్నారు. కానీ మరి కొందరు బల్దియాలో పాతుకుపోయిన వారిని బయటకు పంపించి వారిని నియమించిన పనిలో విధులు నిర్వర్తించేలా చేస్తే మిగతా సిబ్బందికి పని భారం తగ్గుతుందని అభిప్రాయపడుతున్నారు.

పని తక్కువ.. సిబ్బంది ఎక్కువ

జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు సర్కిల్ కార్యాలయాల్లో పని చేస్తున్న నాలుగో తరగతి ప్రభుత్వ, పీహెచ్ వర్కర్ల హోదాలో పని చేస్తున్న సిబ్బంది ఎక్కడ చూసినా పుట్లకొద్ది కనిపిస్తారు. కొందరు ఏ సెక్షన్‌లో ఏం పని చేస్తారో కూడా అక్కడి అధికారులకు తెలియకపోవడం గమనార్హం. పీహెచ్ వర్కర్లుగా అడ్డదారిలో నియామకమైనవారితో పాటు 452 మందిలో చాలా మంది ఇక్కడే విధులు నిర్వర్తిస్తారని తెలిసింది. నగరంలో శానిటేషన్ పనుల కోసం ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమిస్తే ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల అండదండలతో కొందరు ఇక్కడే అడ్డా పెట్టి ప్రతీ నెల జీతం పుచ్చుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు.



ఇక పబ్లిక్‌హెల్త్ విభాగంలో 20మందికి పైగా పని చేయడం చూసి అదనపు కమిషనర్ సైతం అవాక్కయ్యారు. ఎవరు ఏం పని చేస్తున్నారు? అని అడిగితే స్పష్టమైన సమాధానం రాకపోవడంతో ఇంత కాలం బల్దియా ఎంత నష్టపోయింది అని ఓ అంచనాకు వచ్చినట్టు తెలిసింది. ఇంకా టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటేషన్, హార్టికల్చర్, డెత్, బర్త్ సెక్షన్, ఐటీ, ఎల్‌వో కార్యాలయం, ఇన్‌వార్డు, ఔట్‌వార్డు, పౌరసేవా కేంద్రం, అటెండర్లు, స్వీపర్లు, వాచ్‌మెన్‌లతో పాటు ఆర్‌ఐలు, ఆర్‌వోలు, వార్డ్ ఆఫీసర్లు, బిల్‌కలెక్టర్ల వద్ద పనిచేసే అసిస్టెంట్లుగా పని చేస్తున్నారు.

అంతేకాకుండా కలెక్టర్ బంగ్లా, కమిషనర్ క్యాంపు ఆఫీస్, కొందరు కార్పొరేటర్ల ఇళ్లలో పనివాళ్లుగా ఉన్నారు. ఇంకా ఇంజనీర్లు, బల్దియా అధికారుల ఇండ్లతో పని మనుషులు, కారు డ్రైవర్లు, తోటమాలీలుగా పని చేయడంతో శానిటేషన్ విభాగంలో తక్కువ కావడంతో పని ముందుకు సాగడం లేదు. మొత్తంగా 500 మందికి పైగా పీహెచ్ వర్కర్ పనులను ఇతర పనులు చేస్తున్నట్టు గుర్తించినట్టు అధికారులు వెల్లడించారు. 70మంది జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయం, 55 మంది కాశిబుగ్గ సర్కిల్, 52 మంది కాజీపేట సర్కిల్ కార్యాలయంలో (పీహెచ్) వర్కర్లు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు దర్జాగా పని చేస్తున్నట్టు తెలిసింది. వీరిని త్వరలో మాతృస్థానానికి తరలిం

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల హవా..

చాలా కాలంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ప్రధాన కార్యాలయంలో పని చేస్తూ చక్రం తిప్పుతున్నట్టు కమిషనర్ దృష్టికి రావడంతో అందరినీ అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ చేసే యోచనలో ఉన్నట్టు తెలిసింది. ప్రధానంగా టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లో ఓ కంప్యూటర్ ఆపరేటర్ సంబంధిత ఉన్నత స్థాయి అధికారికి ఆదాయమార్గంగా ఏర్పడి పర్మినెంట్ ఉద్యోగులను సైతం చీవాట్లు పెట్టిస్తున్నాడు. అంతే కాకుండా అందిన కాడికి దండుకుని ఇళ్ల అనుమతులు జారీ చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.

అలాగే టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారులకు సైతం డబ్బు ఆశ చూపిస్తూ అక్రమ ఇళ్ల నిర్మాణాలకు ఆజ్యం పోస్తున్నట్టు తెలిసింది. ఇంకా ఐటీ సెక్షన్‌లో ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి పూర్తి బాధ్యతలు అప్పగించి బల్దియా డాటా మొత్తం అప్పగించడం వివాదాస్పదంగా మారింది. ఇంకా ఎల్‌వో కార్యాలయంలో ఓ వ్యక్తి మంచి భూములను కాస్త వివాదాస్పదం చేసి అందినకాడికి దండుకుంటున్నట్టు తెలిసింది.



పాలకుర్తిలో మాట్లాడుతున్న దయాకర్‌రావు

సంస్కృతిని దెబ్బతీసేందుకే బతుకమ్మ పేరు తీసేశారు

- ఇందిరమ్మ పేరుతో చీరల పంపిణీ బాధాకరం
- మాజీ మంత్రి దయాకర్‌రావు

పాలకుర్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతిని దెబ్బతీసేందుకే బతుక మ్మ పేరు కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ పేరుతో చీరల పంపిణీ చేయడం బాధాకరమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహిం చిన పంచాయతీ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతూ సర్వేలన్నీ బీఆర్ఎస్ బలపరిచిన సర్పం చులే గెలుస్తారని చెబుతున్నాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన మోసపూరితమైందని ప్రజలందరికీ అర్థమైందన్నారు. సమావేశంలో నాయకులు పసునూరి నవీన్, నల్ల నాగిరెడ్డి, పల్లా సుందర్‌రాం రెడ్డి, బబ్బూరి శ్రీకాంత్, జరుపుల బాలూనాయక్, కారుపోతు వేణు, మాచెర్ల ఎల్లయ్య, ముస్కు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పార్టీ అభ్యర్థుల్ని గెలిపించాలి

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సమన్వయంతో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలని పార్టీ మండలాధ్యక్షుడు జూలకుంట్ల శిరీష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఇప్పగూడెం గ్రామంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎంపిక చేసిన మందపురం అనిల్‌గౌడ్ విజయానికి ప్రతీ కార్యకర్త పాటుపడాలని కోరారు. ఇప్పగూడెం గ్రామం పైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక దృష్టిని పెట్టారని, భారీ విజయంతో అనిల్‌గౌడ్‌ను గెలుపొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కత్తుల కట్టయ్య, గొడుగు రాజయ్య, నెలమంచ అజయ్ రెడ్డి, దైద ఎలిషన్, కత్తుల మల్లయ్య, పల్లె రవీందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మూఢ విశ్వాసాలను తరిమేయాలి

జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్

జనగామ కల్చరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మూఢ విశ్వాసాలను తరిమికొట్టాలని, విద్యార్థులలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెపొందించుకోవాలని జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఏకశిల బీఈడీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబురాల సమావేశానికి జేవీవీ జిల్లా అధ్యక్షుడు గంట రవీందర్ అధ్యక్షత వహించగా డీసీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులలో సైన్స్‌పై ఆసక్తిని పెంచడానికి, మూఢ విశ్వాసాలపై అప్రమత్తంగా ఉండడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. రవీందర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో జనగామ జిల్లా పేరును నిలబెట్టాలని, చెకుముకి నిర్వాహకులు ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు నిర్వహించి సమాజ అభివృద్ధికి పాటుపడాలన్నారు.

చెకుముకి సంబురాలలో 30 టీముల ద్వారా 140 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను కనబరిచాయి. జెడ్పీహెచ్ఎస్ - ధర్మకంచ, జెడ్పీహెచ్ఎస్ - లింగాల ఘణపురం, ఎంజేపీ - మొండ్రాయి, సాన్‌మారియా హైస్కూల్ - జనగామ తో మొత్తం నాలుగు టీములు ఉత్తమ ప్రతిభ కనబరిచి కరీంనగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఉమాదేవి, లక్ష్మణ్, చంద్రశేఖర్‌రావు, బాలరాజు, శోభన్, సత్తయ్య, ఆంజనేయచారి, సుధీర్‌రెడ్డి, కృష్ణమూర్తి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ రాజమహేంద్ర నాయక్

కొమురవెల్లి ఉత్సవ కమిటీలో బీసీలకు పెద్దపీట



కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న కాంగ్రెస్ శ్రేణులు

జనగామ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి దేవస్థాన ఆలయ ఉత్సవ కమిటీలో వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్ శుక్రవారం పేర్కొన్నారు. కొమురవెల్లి ఆలయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బీసీ, ఎస్సీలకు 90శాతం ప్రాతినిధ్యం కల్పించామని తెలిపారు. జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులతో కలిసి కొత్తగా నియామకమైన ఉత్సవ కమిటీ సభ్యులు మల్లికార్జునస్వామిని శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్సవ కమిటీలో 14మంది ఉండగా టెక్నికల్ సమస్యతో ఇద్దరికి అవకాశం రాలేదన్నారు. నియమించిన 12 మందిలో ఇద్దరు ఓసీ కాగా ఎస్సీలకు రెండు, బీసీల్లో 8 మందికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఎన్నడూ లేని విధంగా బీసీల్లో గొల్లకురుమలకు ఐదుగురికి అవకాశం దక్కిందన్నారు.

బీసీలకు ప్రాధాన్యత కల్పిస్తూ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతిపాదించిన జాబితాను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆమోదం తెలిపారు. బీసీలకు పెద్దపీట వేసినప్పటికీ కొందరు కావాలనే ఆలయ ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నాలు చేసుకోవాలి, వాటిని మానుకోవాలని అన్నారు. పార్టీ ప్రతిష్టను దిగజార్చేలా వ్యాఖ్యలు చేయడం, నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై చిల్లర భాషను మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. మల్లన్నను దర్శించుకున్న వారిలో చేర్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్వేత, నాయకులు మల్లేశం, రవి, బుచ్చిరెడ్డి, నర్సిరెడ్డి, లక్ష్మీనారాయణ, హరిబాబు ఉన్నారు.

30న కొమురవెల్లి దేవస్థాన ఈవో కార్యాలయం ముట్టడి

జనగామ రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఈనెల 30న కొమురవెల్లి దేవస్థాన ఈవో కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కురుమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు జాయ మల్లేశం శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కొమరవెల్లి మల్లన్న దేవాయలయంలో బీసీ కులాలపై అన్యాయం జరుగుతుందన్నారు. 30 ఈవో కార్యాలయ ముట్టడికి బీసీ సంఘాల పిలుపునివ్వడం జరిగిందని పేర్కొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ తాత్కాలిక నిలుపుదల

తరిగొప్పుల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జనగామ ఆర్డీవో ఆదేశాల మేరకు లబ్ధిదారులకు అధికారులు పంపిణీ చేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పట్టాలను తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు తరిగొప్పుల తహసీల్దార్ మొగుళ్ల మహిపాల్ రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అక్కరాజుపల్లిలో నిర్మించిన 30డబుల్ బెడ్‌రూం ఇండ్లలో 22 ఇండ్లకు సంబంధించిన పట్టాలను అధికారులు రెండు నెలల క్రితం లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

సీపీఎంలో పలువురి చేరిక

పాలకుర్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : ఈరవెన్నుకు చెందిన పలువురు గ్రామస్తులు ఆ పార్టీ మండల నాయకుడు ఏదునూరి మదార్ శుక్రవారం ఆధ్వర్యంలో సీపీఎంలో చేరారు. వారికి ఎర్ర కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మదార్ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలో చేరిన గ్రామస్తులు తాటికాయల జానీ, అనిల్, దేవ, మహమ్మద్ యాకూబ్ పాషాలు ఘనంగా స్వాగతం పలికినట్లు తెలిపారు.

సీఎంకు తొత్తుగా మారి కేటీఆర్‌పై విమర్శలు

మాజీ ఎమ్మెల్యే రాజయ్య



సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డికి తొత్తుగా మారి ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, యూత్ ఐకాన్ కేటీఆర్‌పైన విమర్శలు చేయడం సరికాదని మాజీ ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్ పార్టీ కార్యర్తల పుణ్యంతో గెలిచి నేడు పార్టీ నేతల పైన ఇష్టారాజ్యంగా వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు అన్నారు. కడియంకు నీతినిజాయితీ ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేయాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ గత పదేళ్ల కాలంలో కడియంకు అనేక పదవులు ఇచ్చిందన్నారు. ఇప్పుడు కేటీఆర్‌ను ఐరన్‌లెగ్ అంటున్న కడియం అప్పుడు, సీఎం రేవంత్ రెడ్డిని, రాహుల్ గాంధీలను కూడా ఐరన్‌లెగ్‌లు అని సంబోధిస్తాడన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మారపాక రవి, పార్టీ మండలాధ్యక్షుడు మాచర్ల గణేష్, కుమార్‌గౌడ్, పట్టణాధ్యక్షుడు కనకం గణేష్, నాయకులు ఆకుల కుమార్, మహేందర్ రెడ్డి, బంగ్లా శ్రీనివాస్, తాటికొండ సురేష్‌కుమార్, మారపల్లి ప్రసాద్, గుండె మల్లేషం, బత్తుల రాజన్‌బాబు, మునిగెల రాజు, పెసరు సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

● జఫర్‌గఢ్ (ఆంధ్రజ్యోతి): కూనూరులో బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి పల్లెపాటి జైపాల్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి శుక్రవారం మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య హాజరయ్యారు. బీఆర్ఎస్ ప్రతినిధులతో కలిసి కూనూరు నామినేషన్ కేంద్రానికి వెళ్లి పార్టీ అభ్యర్థి నామినేషన్ పత్రాన్ని ఎన్నికల అధికారికి అందించారు. అంతకు ముందు గ్రామంలో ఇటీవల మృతి చెందిన చాగంటి రుద్రయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.



రఘునాథపల్లిలో నామినేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్, పరిశీలకులు రవి కిరణ్

ఎన్నికలు సాఫీగా జరిగేలా చూడాలి

జిల్లా ఎన్నికల పరిశీలకులు రవికిరణ్

రఘునాథపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కాగా అమలు కావాలని, జీపీ ఎన్నికల నిర్వహణ సాఫీగా జరిగేలా అధికారులు ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల పరిశీలకులు రవికిరణ్ ఆదేశించారు. నిడిగొండ, కంచనపల్లి, రఘునాథపల్లిలోని నామినేషన్ కేంద్రాలను కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్‌తో శుక్రవారం నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో జడ్పీసిఇవో మాధురి షా, డీఆర్డీవో వసంత, ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ ఫణికిషోర్, ఎంపీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై బీజేపీ మొసలి కన్నీరు: కడియం

(5వ పేజీ తరువాయి)

9వ షెడ్యూల్‌లో చేర్చితే బీసీ బిల్లుకు చట్టబద్ధత లభిస్తుందన్నారు. అది చేయకుండా ఇక్కడ మాత్రం బీసీలను కాంగ్రెస్ మోసం చేస్తుందని మొసలి కాన్నీరు కార్చడం సిగ్గుచేటన్నారు. బీజేపీ బీసీలకు చేస్తున్న మోసాలపై బీఆర్ఎస్ నోరుమెదపకుండా వత్తాసు పలుకు తుందన్నారు. రాహుల్ గాంధీ నిర్ణయం మేరకు తెలంగాణలో 42శాతం రిజర్వేషన్‌పై తీర్మానం చేసిన తర్వాతే అన్ని పార్టీలు బీసీ రిజర్వేషన్లపై చర్చమొదలైందన్నారు. కార్యక్ర మంలో తాజా మాజీ జడ్పీటీసీ గుడివంశీధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొల్లూరు శివ కుమార్, నాయకులు దూసరి గణపతి, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు లొక్కుంట్ల ప్రవీణ్, కీసర దిలీప్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు నీలం మోహన్, శ్రీలతారెడ్డి, దామెర నాగరాజు పాల్గొన్నారు.

రెండో రోజు పెరిగిన నామినేషన్లు

(5వ పేజీ తరువాయి)

జఫర్‌ఘడ్ మండలంలో సర్పంచులకు 27, వార్డు సభ్యులకు 23 నామినేషన్లు వచ్చాయి. అదే విధంగా చిల్పూరు మండలంలో సర్పంచులకు 22, వార్డు సభ్యులకు 34, స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలో సర్పంచులకు 24, వార్డు సభ్యులకు 31, రఘునాథపల్లి మండలంలో సర్పంచులకు 44, వార్డు సభ్యులకు 47 నామినేషన్లు వచ్చాయి. ఐదు మండలాల్లో గురు, శుక్రవారాలతో కలిపి ఇప్పటి వరకు సర్పంచులకు 261, వార్డు సభ్యులకు 234 నామినేషన్లు వచ్చాయి. కాగా.. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ శనివారంతో ముగియనుంది. దీంతో శనివారం నాడు నామినేషన్లు పెద్ద సంఖ్యలో దాఖలు అయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి

సంబంధిత అధికారులు నివారణకు చర్యలు చేపట్టాలి

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



రోడ్డు ప్రమాదాల నివారణ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జనగామ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని, ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై కలెక్టరేట్‌లో శుక్రవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రవాదారులపై జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు పోలీసు, రవాణా, జాతీయ రహదారుల అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. యూ టర్న్‌ల వద్ద లైటింగ్, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. యశ్వంతపూర్ జంక్షన్ వద్ద సర్వీస్ రోడ్డును పెంచాలన్నారు. లైటింగ్ లేని చోట వాహనాల పార్కింగ్ చేయకుండా చూడాలన్నారు. ప్రధాన రహదారిపై ఆర్టీసీ వారు ప్రయాణికులు బస్సు ఎక్కడానికి కానీ దిగడానికి బస్సులను ఆపకూడదన్నారు. సమావేశంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● రైతుల సంక్షేమం కోసమే కొత్త విత్తన చట్టమని కలెక్టర్ అన్నారు. నూతన విత్తన చట్టం-2025 ముసాయిదాపై అభిప్రాయ సేకరణ కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నూతన విత్తన చట్టం రైతుల ప్రయోజనాలను కాపాడటమే ప్రధాన లక్ష్యమన్నారు. మార్కెట్‌లో లభిస్తున్న విత్తనాల నాణ్యత క్రమబద్ధీకరించడం, రైతులకు గిట్టుబాటు ధరల్లో మంచి విత్తనాలను అందుబాటులోకి తీసుకురావడం, నకిలీ విత్తనాల అమ్మకాన్ని అరికట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ శాస్త్రవేత్త డాక్టర్ ఉమారెడ్డి, డీఏవో అంబికా సోని, మండల వ్యవసాయ అధికారులు, విత్తన డీలర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

● రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల సౌలభ్యం కోసం అందుబాటులోకి తెచ్చిన టీ-పోల్ మొబైల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. టీ-పోల్ యాప్ ద్వారా ఓటర్లు తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉందో అనే వివరాలను పరిశీలించుకోవడంతో పాటు, ఓటరు స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన అంశాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చన్నారు.

సృజనాత్మకత పెంపునకే వైజ్ఞానిక ప్రదర్శనలు

(5వ పేజీ తరువాయి)

అవసరమైనవి ఉన్నాయన్నారు.స్మార్ట్ ఫోన్ ద్వారా అందుబాటులో ఉన్న ఏఐ యాప్స్ (చాట్ జీపీటీ, జెమినీ మొదలుగునవి) ద్వారా ఎటువంటి సమాచారాన్నయినా సరైన సూచనలు ఇచ్చి మనం పొందగలిగే అవకాశం ఉన్నందున విద్యార్థులు ఈ అవకాశాన్ని మంచికి ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం పలు పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చే ఖాన్ అకాడె మీ, ఫిజిక్స్ వాలా వంటి సంస్థలతో ఒప్పందం కుదుర్చుకొని విద్యార్థులం దరికీ కోర్సు మెటీరియల్ పొందే అవకాశం కల్పించిందన్నారు.

సైన్స్ ఫెయిర్ కన్వీనర్, డీఈవో, అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని తమ తమ అభి రుచి, ఆసక్తికి అనుగుణంగా తమ కోర్సులను ఎంచుకొని జీవితంలో రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఇందుకు సౌకర్యాలు సంపూర్ణంగా విని యోగించుకోవాలన్నారు. ప్రదర్శన గదులలోని ప్రాజెక్టులను అదనపు కలె క్టర్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించి వీక్షించారు. విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్లను వీక్షించిన కలెక్టర్ వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు ...

సైన్స్ ఫెయిర్ ప్రారంభోత్సవం సందర్భంగా సాన్ మారియా విద్యార్థులు శాస్త్రీయ నృత్యంతో అలరించారు. ఉపాధ్యాయిని విద్యార్థులు ప్రత్యేకంగా అతిథులకు బ్యాడ్జ్ పెట్టి స్వాగతం పలికారు. 333 ఎగ్జిబిట్లు రాగా ఇన్‌స్పైర్‌కు 77 ఎగ్జిబిట్లు ప్రదర్శనకు వచ్చాయి. జ్యూరీ కమిటీ సభ్యులు వెంటనే మూల్యాంకనం ప్రారంభించారు. తొలిరోజు కార్యక్రమానికి ఆరు మండలాల నుంచి 37పాఠశాలలకు చెందిన 3,200 మంది విద్యార్థులు హాజరై ప్రదర్శనను వీక్షించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సీహెచ్.ఉపేందర్, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ, సైన్స్ ఫెయిర్ కోకన్వీనర్ బొమ్మనబోయిన శ్రీనివాస్, జాయింట్ కన్వీనర్, ఎంఈవో శంకర్‌రెడ్డి, ఏసీజీ రవికుమార్, సీఎంవో నాగరాజు, ఏఎస్‌సీ శ్రీకాంత్‌రెడ్డి, డీసీఈబీ సెక్రటరీ చంద్రభాను, సాన్‌మారియా హైస్కూల్ కరస్పాండెంట్ జగన్మోహన్‌రెడ్డి, మేనేజర్ మధు, ప్రిన్సిపాల్ రాధాకృష్ణ తదితరుల పాల్గొన్నారు.

ఆమే.. కీలకం

(5వ పేజీ తరువాయి)

మహిళలకు వివరించే ప్రయత్నాలు చేస్తున్నాయి.

జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో మహిళా ఓట్లే అధికంగా ఉన్నాయి. 12 మండలాల్లో మొత్తం ఓటర్లు 4,01,496 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 1,98,525 మంది ఉండగా మహిళా ఓటర్లు 2,02,963 మంది ఉన్నారు. కాగా.. జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లు 4438 మంది అధికంగా ఉన్నారు. జిల్లాలో ట్రాన్స్‌జెండర్లు(ఇతరులు) 8 మంది ఉన్నారు. ఇతరులు చిల్పూరు, జఫర్‌ఘడ్, బచ్చన్నపేట పాలకుర్తిలో మండలాల్లో ఒక్కొక్కరు చొప్పున ఉండగా, రఘునాథపల్లి, కొడకండ్ల మండలాల్లో ఇద్దరు చొప్పున ఉన్నారు.

రెండో విడత ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	మొత్తం
జనగామ	16,892	17,092	33,984
నర్మెట్ట	10,121	10,396	20,517
తరిగొప్పుల	8,009	8,079	16,088
బచ్చన్నపేట	19,322	20,208	39,531
మొత్తం	54,344	55,775	1,10,120

మూడో విడత వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	మొత్తం
దేవరుప్పుల	18,610	18,723	37,333
పాలకుర్తి	26,189	16,675	52,865
కొడకండ్ల	14,202	14,468	28,672
మొత్తం	59,001	59,866	1,18,870

ముడుపులివ్వనిదే మ్యుటేషన్ చేయనన్నాడు..

(5వ పేజీ తరువాయి)

ఆశ్రయించారు. డబ్బులు ఇస్తుండగా పట్టించి ఆట కట్టించారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర తహసీల్దార్ వీరంగటి మహేందర్ సూచనలతో ఆయన డ్రైవర్ లంచం తీసుకుటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం..

పెద్దవంగర మండలంలోని పడమటితండాకు చెందిన భూక్య స్వామి ఇటీవల మరణించాడు. అతడి పేరు మీద గంట్లకుంట గ్రామశివారులో సర్వే నెంబర్ 212/2, 226/5, 227/5లో 3.09 ఎకరాలు భూమి ఉంది. తన తండ్రి వారసత్వ భూమిని మ్యుటేషన్ చేయించుకోవడానికి స్వామి కుమారుడు భూక్య బాలు సెప్టెంబర్ 25న మీసేవలో బాలు దరఖాస్తు చేసుకున్నాడు. క్షేత్రస్థాయి అధికారులు భూమిని పరిశీలించారు. అయినా ఫైల్ మాత్రం కదలలేదు. పలుమార్లు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. తహసీల్దార్‌ను కలిస్తే మ్యుటేషన్ చేయాలంటే రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేసేదేమీ లేక రూ.15 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో బాధిత రైతు బాలు భార్య సాధ్వి, సమీప బంధువు దారావత్ మురళి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు.

అధికారుల సూచనల మేరకు రూ.15వేలు తీసుకుని రైతు కుటుంబం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆయన డ్రైవర్ గౌతమ్ కార్యాలయం ఎదుట రైతు నుంచి డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం తహసీల్దార్ వీరంగటి మహేందర్, డ్రైవర్ గౌతమ్‌ను అదుపులోకి తీసుకున్నామని డీఎస్పీ సాంబయ్య పేర్కొన్నారు. ఈ దాడుల్లో సీఐలు ఎల్.రాజు, ఎస్.రాజు పాల్గొన్నారు.

కాగా, తన తండ్రి పేరుమీద ఉన్న భూమిని మ్యుటేషన్ చేయించుకోవడానికి తహసీల్దార్ డబ్బుల కోసం వేధించాడని బాధిత రైతు బాలు, ఆయన భార్య తెలిపారు. దీంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించామన్నారు.

ఎన్నికల తర్వాత బకాయిదారులపై చర్యలు

పాలకుర్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీ సోమేశ్వరలక్ష్మీ నర్సింహస్వామి దేవస్థానంకు బకాయిపడ్డ కాంట్రాక్టర్లపై స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో డీ.ఎస్. వెంకన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, దేవస్థానం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2008 నుంచి 2019 వరకు కొబ్బరికాయలు, కొబ్బరి ముక్కల కాంట్రాక్టర్ టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు దేవస్థానంకు బకాయిపడ్డారని 11 సంవత్సరాలుగా డబ్బులు చెల్లించకుండా జాప్యం చేస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఎన్నికల తర్వాత టెండర్ దారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ సరస్వతీ, ఈవో లక్ష్మీప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.

పూలేకు నివాళి

జనగామ కల్చరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే 135వ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం జనగామ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి, కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్, మల్లిగారి రాజు, దూసరి ధనలక్ష్మి, శ్రీకాంత్, మచ్చ కుమార్, తాళ్లపల్లి ఎల్లేష్, ఆడెపు రమేష్, కొంగరి నర్సింహ్మా పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థుల పేర్లు ఖరారు

బచ్చన్నపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ తరుఫున బరిలో నిలువాలని ఆశిస్తున్న వారి పేర్లను క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు శుక్రవారం ప్రకటించారు. వీఎస్ఆర్‌నగర్- కోనేటి వాణిశ్రీ, ఇటుకాలపల్లి- కొలుగూరి రాములు, రాం చంద్రాపూర్- గొలుసుల కనకయ్య, దబకుంటపల్లి- కొంతం చంద్రకళ, సాల్వాపూర్- మిద్దెల శ్రీధర్‌గౌడ్, నారాయణపూర్- పొన్నాల స్రవంతి, గోపాల్ నగర్- పేరబోయిన కళ్యాణి, చిన్నరామన్‌చర్ల- ఎండీ ఆజాం, ఆలీంపూర్- పాకాల పద్మలను ఎంపిక చేశారు.

కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలి

బచ్చన్నపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని ఆపార్టీ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి కోరారు. శుక్రవారం పోచన్నపేటకు చెందిన కొయ్యడ శ్రీనివాస్‌గౌడ్, నారాయణపూర్‌కు చెందిన పరిదె భీమేష్‌లు తన అనుచరులతో కలిసి జనగామలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలున్నారు.